‘జగనన్న సురక్ష’తో సత్వర సేవలు

- లబ్ధిదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- 74, 75 వార్డుల్లో ధ్రువపత్రాల పంపిణీ


దుర్గవానిపాలెంలో మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సాంకేతిక, ఇతర కారణాల వల్ల ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో, 75వ వార్డు పరిధిలోని దుర్గవానిపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతం ఎవరైనా అర్హులు ఉంటే, వలంటీర్లు ఇంటింటా జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తిస్తున్నారన్నారు. వారికి ఏయే పథకాలు అందాల్సి ఉంది, వాటి కోసం ఏమేం ధ్రువీకరణ పత్రాలు కావాలో వివరాలు నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రజలు తమకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్ల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటివద్దే ఉచితంగా ధ్రువ పత్రాలు అందుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. పేదలందరికీ లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2095 మందికి ధ్రువపత్రాలు

74వ వార్డులో 726 మందికి, 75వ వార్డులో 1369 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, తహసీల్దార్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74 75 వార్డుల కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పులి ర్యూన్సీ లక్ష్మీబాయ్, వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్ రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, ఏపీడీ రాము, ప్రత్యేక అధికారులు శ్రీకాంత్, భాస్కర్, వార్డు నాయకులు పాల్గొన్నారు.


టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

రెండు రోజుల్లో కుల ధ్రువపత్రం ఇచ్చారు



నాకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. ఇందుకోసం మా వలంటీర్‌ను సంప్రదించగా వెంటనే దరఖాస్తు చేయించారు. రెండే రెండు రోజుల్లో సురక్ష కార్యక్రమంలో నాకు సర్టిఫికెట్ అందజేశారు. చాల సంతోషంగా ఉంది.
– గొరుసు వరలక్ష్మి, అయ్యన్నపాలెం

చాలా మంచి కార్యక్రమం



గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల చుట్టూ పనుల కోసం తిరిగే వాళ్లం. కానీ ఇప్పుడు సచివాలయానికి వెళ్తే జగనన్న సురక్ష కార్య క్రమం సర్టిఫికెట్లు ఇస్తున్నా మని తెలిపారు. మూడు రో జుల క్రితం దరఖాస్తు చేశా ను. పైసా ఖర్చు లేకుండా నాకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– గొడ్డు అప్పలనర్సమ్మ, రెడ్డి ముసలినాయుడు పాలెం

ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు



నాకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరం అయ్యాయి. ఈ సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులను వారే నింపి సచివాలయానికి తీసుకెళ్లారు. మూడు రోజుల్లోనే ఆ సరిఫికెట్లను సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందజేశారు. సీఎం జగన్ సార్‌కు కృతజ్ఞతలు.
– చిట్టి చిలకమ్మ, గొందేశి వీధి, పెదగంట్యాడ

క్లుప్తంగా

భారీ గణేశుడి విగ్రహానికి ఘనంగా రాట


రాట ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో పాతగాజువాకలో నెలకొల్పనున్న భారీ గణేశుడి విగ్రహానికి సోమవారం రాట ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీ, ఉత్సవ నిర్వాహకుడు గణేష్, స్థానిక నాయకులు బాటా శ్రీను, రోజారాణి, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకట రమణ, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పత్రీజీ ఆరాధనోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలిదిండి వర్మ

పెదగంట్యాడ: పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకుడు బ్రహ్మర్షి పత్రీజీ ఆరాధనోత్సవాలను పిరమిడ్ అహింసా ధ్యాన కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ధ్యానం నిర్వహించారు. పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ కన్వీనర్ మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలిదిండి వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పత్రీజీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పిరమిడ్ సొసైటీ ఆదర్శ సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో వనిత, అప్పలరాజు, శేషారత్నం, లక్ష్మి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

29న సమావేశం జయప్రదం చేయాలి

గాజువాక: ఈ నెల 29న గాజువాకలో నిర్వహించనున్న బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని పార్టీ కార్యకర్తలు జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణరాజు కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరు కానున్న సమావేశాన్ని అసెంబ్లీ నియోజకవర్గ శక్తి కేంద్ర ప్రముఖులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. సమావేశం నిర్వహించనున్న పద్మశ్రీ ఫంక్షన్ హాల్‌ను జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులతో కలిసి సోమవారం పరిశీలించారు. నాయకులు పుట్ట గంగయ్య, దానేష్‌వర్మ, పొలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పోర్టు కార్మికుల ధర్నా


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గంగవరం పోర్టు అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, కొండయ్య, మహ్మద్ నజీర్, దుమ్మెట అప్పారావు, శీత మదన్, వై.కొండయ్య, సోడదాసు సుధాకర్, వి.కృష్ణారావు, బి.జగన్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధి


కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేశానని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. ఆమెను వార్డుకు చెందిన ప్రజా సంఘాలు సోమవారం ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా పనిచేసిన తనకు అధికారులు, ప్రజలు సహకారం అందించడంతో వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 85వ వార్డులో మూడున్నర కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. వీధి దీపాల కోసం టెండర్లు పిలిచామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, నాయకులు బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, పిల్లా కొండలరావు, సురేష్, రవి, విందుల వరహాలు, దాసరి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి కుటుంబ సభ్యులకు సత్కారం


మాజీ సైనికుడి భార్యను సత్కరిస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మాజీ సైనికుల కుటుంబ సభ్యులను సత్కరించుకోవడం మన బాధ్యత అని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. 74వ వార్డు వెంపళ్లనగర్‌కు చెందిన మాజీ సైనికాధికారి, వీర్ చక్ర అవార్డు గ్రహీత జాజుల సన్యాసి భార్య చినతల్లి, కుమారుడు గంగరాజును 6వ మద్రాస్ బెటాలియన్ ఆర్మీ అధికారులు రిమ్ సేమ్, కృష్ణకుమార్, కనకరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సన్యాసిరావు కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ 1971లో జరిగిన యుద్ధంలో బంకర్లను పేల్చి పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టడంలో సన్యాసి కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. ఆయన విగ్రహాన్ని వెంపళ్లనగర్ జంక్షన్‌లో పెట్టాలన్నారు.

రహదారులు జలమయం


పాతగాజువాక జంక్షన్ సమీపంలో నిలిచిన నీరు


వుడా కాలనీ రోడ్‌లో వర్షం నీరు

గాజువాక: గాజువాకలో పలు రహదారులు వర్షంతో జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నేపథ్యంలో తవ్వేసిన రోడ్లపై గోతులు పడటంతో అవస్థలు తప్పలేదు. చినగంట్యాడ వందడుగుల రోడ్, కణితి రోడ్, వుడా డబుల్ రోడ్డుల్లోని గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారిపై శ్రీనగర్ ఫ్లైఓవర్ వంతెన వద్ద వర్షం నీరు చెరువును తలపించింది.

లారీ ఢీకొని ఒరిగిన చెట్టు


టీఐసీ పాయింట్ వద్ద రోడ్డు పక్కన చెట్టును ఈడ్చుకుపోతున్న లారీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు టీఐసీ పాయింట్ వద్ద రోడ్డు పక్కన చెట్టును ఓ లారీ ఢీకొట్టింది. దీంతో ఆ చెట్టు రోడ్డుపై ఒరిగిపోయింది. సిమెంట్ లోడుతో దుర్గాబజార్ నుంచి బాలాజీనగర్ వైపు వెళ్తున్న లారీ పైభాగం ఇక్కడ తురాయి చెట్టు కొమ్మలకు తగిలింది. లారీ ఆగకుండా ముందుకు సాగడంతో చెట్టు వేళ్లతో సహా ఒరిగిపోయింది. చెట్టు ఒరిగిపోయి కొమ్మలు రోడ్డుమీద వేలాడుతుండడంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. అలాగే విద్యుత్ స్తంభానికి ఉన్న కనెక్షన్లు తెగిపోయాయి. దీంతో చుట్టుపక్కల నివాసాలు, షాపులకు సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒరిగిన ఈ చెట్టు ఎప్పుడు పూర్తిగా కూలిపోతుందోనని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చెట్టును పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.

కల్యాణం .. కమనీయం


అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మెకానికల్ విద్యార్థులకు అపార అవకాశాలు


మాట్లాడుతున్న శ్రీహారిక

అగనంపూడి: బీటెక్ మెకానికల్ పూర్తి చేసిన విద్యార్థులకు అపారమైన అవకాశాలు దొరుకుతున్నాయని లామ్ రీసెర్చ్, మెకానికల్ డిజైనర్ శ్రీహారిక అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐదు రోజుల వ్యక్తిత్వ వికాసాభివృద్ధి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆటోమొబైల్, ఏవియేషన్, డ్రోన్ టెక్నాలజీ రంగాల్లో మెకానికల్ విభాగం విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, మెకానికల్ విభాగాధిపతి రాంబాబు, కో–ఆర్డినేటర్లు హరీష్ కుమార్, సుధ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు


గొడ్డువానిపాలెంలోని డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తను తీయిస్తున్న ఏఎంహెచ్‌వో

పెదగంట్యాడ: వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాలువల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. 64వ వార్డు గొడ్డువానిపాలెంలోని డ్రెయిన్‌లో పూడుకుపోయిన పూడికను సోమవారం ఆయన దగ్గరుండి సిబ్బందితో తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నామని చెప్పారు. భారీగా వర్షాలు కురిసినపుడు కాలువలు పొంగిపొర్లడంతో వరద నీరు రోడ్లపైకి వస్తోందని, దీనిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

సిరులతల్లికి స్వర్ణపుష్పార్చన నేడు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం


కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెంకటరావు

కొమ్మాది: రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ ఛాలెంజర్స్ అండ్ టెండర్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 5 రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కె.వెంకటరావు ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి


జాషువా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘం నాయకులు


జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ:: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, గంట్యాడ గురుమూర్తి, దేవుపల్లి సంపూర్ణం, గంగులూరి రోజారాణి, నక్క వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద..

బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం చైర్మన్ వేణు గోపాల్ గౌతమ్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద జాషువా వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవికుమార్, చిన్నారావు, అనపర్తి వెంకటరమణ,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం


893వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కార్మిక సంక్షేమానికి చేటు అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 893వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడితే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అయ్యంకి సేవలు చిరస్మరణీయం


అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, పాఠకులు

పెదగంట్యాడ: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు మరువలేమని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. శాఖా గ్రంథాలయంలో అయ్యంకి జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్, రాంబాబు, రమేష్, వేణు, ప్రసాద్, పురుషోత్తమ, హరి, అర్జున్ పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకం


కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్ వరప్రసాద్, తదితరులు

ఏయూ క్యాంపస్: సంస్థలో వ్యక్తి ప్రగతికి కార్య నిర్వాహక నైపుణ్యాలు కీలకంగా నిలుస్తాయని డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్(హెచ్‌ఆర్) కె.ఎస్.వరప్రసాద్ అన్నారు. సోమవారం ఐఐఎం విశాఖపట్నం ఏయూ ప్రాంగణంలో డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు ‘ప్రాజెక్ట్ అన్‌సెర్టినిటీ–రిస్క్ మేనేజ్‌మెంట్ అంశంపై’ఐదు రోజుల పాటు జరిగే సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రాజెక్టుల నిర్వహణ, పూర్తి చేయడం ఎంతో అవసరమన్నారు. విభిన్న సంస్థలు, విభాగాలతో అనుసంధానంగా పని చేయడం, మానవ వనరుల సమర్థ నిర్వహణను వివరించారు. భవిష్యత్తులో ఆటోమేషన్ ఏఐ సాంకేతికతలు ప్రముఖ భూమిక పోషిస్తాయని, సాంకేతికత విస్తృతిని ముందుగా అంచనా వేస్తూ సాగాలన్నారు. అదే విధంగా ఎన్ఏడీకి చెందిన ఐఎన్ఏఎస్ అధికారులకు ఆరు రోజుల ఇండక్షన్ ప్రోగ్రాంని ప్రారంభించారు. ఆచార్య బి.శ్రీరంగాచార్యులు డీఆర్‌డీవో శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రోహిత్ తిత్యాల్, ఆచార్య బాలాజి సుబ్రహ్మణియన్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత


బస్సులో జీవీఎంసీకి చేరుకున్న మేయర్


తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించి క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి వచ్చారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారి సిబ్బందితో వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని కోరారు.